సాక్షి
వికారాబాద్
సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



రాష్ట్రంలో అరాచక పాలన

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ అన్నారు. 8లో▸



త్వరలో ‘పాలమూరు పూర్తి

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. 8లో▸



మట్టి గణపతికి జై

చవితి పండుగ సమీపిస్తుండటంతో మట్టి వినాయకుడి ప్రతిమలకు మార్కెట్లో డిమాండ్ పెరిగింది. 9లో▸

న్యూస్‌రీల్

డబుల్ ఓట్లు తొలగించండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో డబుల్ ఓట్లు ఉంటే తొలగించాలని అడిషనల్ కలెక్టర్, కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యా నాయక్ బీఎల్‌ఓలకు సూచించారు. ఆదివారం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన యువతి యువకులు ఓటర్లుగా చేరాలని సూచించారు. ఫారం 6 ద్వారా కొత్త ఓటర్లను చేర్చుకోవాలని ఫారం 7 ద్వారా చనిపోయిన వారి పేర్లను, డబుల్ ఓటర్లను గుర్తించి తొలగించాలని బూతు లెవల్ అధికారులకు సూచించారు. ఈ అవకాశం ఈ నెల 19వ తేదీ వరకు ఉందన్నారు. కొత్త ఓటర్లను చేర్పించడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, బీఎల్‌ఓ ఆనందమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘నాన్‌చాక్’లో వంశీకృష్ణ ప్రతిభ

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



తాండూరు టౌన్: నాన్‌చాక్ తిప్పడంలో తాండూరు పట్టణానికి చెందిన మూన్‌వాకర్ వంశీ కృష్ణ ప్రతిభ చాటాడు. ఒక సెకనులో తొమ్మిది సార్లు, అలాగే ఒక్క నిమిషం వ్యవధిలో 218 సార్లు నాన్‌చాక్ తిప్పి సరికొత్త రికార్డును సృష్టించాడు. ఈ ఫీట్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. భవిష్యత్తులో మరిన్ని రికార్డులు నెలకొల్పి భారతదేశ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపజేస్తానని వంశీకృష్ణ తెలిపాడు.

ముగిసిన ఉత్సవాలు



పూజలో పాల్గొన్న దంపతులు

బొంరాస్‌పేట: దుద్యాల మండల కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బొడ్రాయి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించి, పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు ప్రక్రియ: కలెక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపడుతున్నట్లు కలెక్టర్ హరీశ్ తెలిపారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు అభ్యంతరాల స్వీకరణ కోసం ఈ ఏడాది జనవరి నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లతో కూడిన 116 బృందాలు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల సహకారంతో 1,114 అపార్ట్‌మెంట్లలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఫారం-6 దరఖాస్తులు 10,275 వచ్చాయని, ఫారం-8 దరఖాస్తులు 5,495 వచ్చాయని.. వాటిని పరిశీలించి పరిష్కరించినట్టు చెప్పారు. సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన 5,628 ఫారం -6, ఫారం -8 దరఖాస్తులు 1,1659, ఫారం -7 దరఖాస్తులు 6,841 సేకరించాయని వెల్లడించారు. శేరిలింగంపల్లిలో ఒకే ఇంటి నంబర్లు కలిగిన 5,155 మంది ఓటర్లు ఉన్నారని అందిన ఫిర్యాదులపై ఈఆర్‌ఓల స్వీయ పర్యవేక్షణలో బీఎల్‌ఓల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించినట్టు తెలిపారు. వారిలో 5,024 మంది ఓటర్లు జాబితాలో ఉన్న చిరునామాల్లోనే నివసిస్తున్నట్లు, ఇంటి నంబర్లు వేర్వేరుగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు విచారణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు.

‘కమలం’@48

- జిల్లాలో బీజేపీ టికెట్ల కోసం దరఖాస్తుల వెల్లువ
- పదుల సంఖ్యలో అప్లికేషన్లు
- నాలుగు నియోజకవర్గాల్లో 48మంది ఆశావహులు
- తాండూరు, పరిగి నియోజకవర్గాల నుంచి అధికం

వికారాబాద్: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బీజేపీ టికెట్లు ఆశిస్తున్న వారు భారీగానే ఉన్నారు. ఊహించని రీతిలో ఒక్కో నియోజకవర్గం నుంచి పదుల సంఖ్యలో తమ పేర్లను పరిశీలించాలని దరఖాస్తు చేసుకున్నారు. అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌ల కంటే కూడా బీజేపీలో పోటీ ఎక్కువగా కనిపిస్తోంది. ఇందులో స్థానికులతో పాటు స్థానికేతరులు టికెట్ల కోసం ప్రయత్నిస్తున్నారు. బీజేపీకి అభ్యర్థులే దొరకడం లేదంటూ ఇతర పార్టీల నుంచి విమర్శలకు ప్రస్తుతం వస్తున్న దరఖాస్తులతో చెక్ పెట్టినట్లయ్యింది. ఈ నెల 4న దరఖాస్తుల స్వీకరన ప్రక్రియను ప్రారంభించిన ఆ పార్టీ వారం రోజుల పాటు సమయం ఇచ్చింది. ఆ గడువు 10వ తేదీతో ముగిసింది.

ఒక్కో నియోజకవర్గం నుంచి..

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి 48 మంది తమ పేర్లను పరిశీలించాలని దరఖాస్తులు చేసుకున్నారు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి పీ నవీన్‌కుమార్, లక్ష్మయ్య, జైపాల్, సత్తయ్య, సహదేవ్, క్రాంతి దరఖాస్తు చేసుకున్నారు. పరిగి నియోజకవర్గం నుంచి పరమేశ్వర్‌రెడ్డి, బూనేటి మారుతి కిరణ్, గిరమోని శ్రీనివాస్, మల్లేశ్ ముదిరాజ్, రాముయాదవ్, ఏవీ రాములు దరఖాస్తు చేసుకున్నారు. ఇక తాండూరు నుంచి యూ రమేశ్, లక్ష్మారెడ్డి, సుదర్శన్‌గౌడ్, మురళీ కృష్ణాగౌడ్, నరేశ్ మహరాజ్, శ్రీలత, పటేల్ జయశ్రీ, పటేల్ రవిశంకర్ దరఖాస్తు చేశారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి పూనం చంద్‌లివూలీ, డాక్టర్ బాలవర్ధన్, బంటు రమేశ్, కూర వెంకటేశ్, బాబయ్య నాయుడు దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు ఆయా నియోజకవర్గాల నుంచి మరి కొందరు దరఖాస్తు చేసుకున్నారు. అయితే జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు కరణం ప్రహాల్లాద్ రావ్, సదానంద్‌రెడ్డి దరఖాస్తు చేసుకోలేదు.

స్థానికేతరులు కూడా..

బీజేపీ టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో స్థానికేతరులు అధికంగానే ఉన్నారు. వీరిలో కొందరు ఇప్పటికే నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన వారు ఉన్నారు.



తాండూరు: బీజేపీ అసెంబ్లీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్న నరేష్ మహరాజ్

అయితే దరఖాస్తు చేసుకోని వారు కూడా టికెట్ల రేసులో ఉండే అవకాశం లేకపోలేదని పలువురు అంటున్నారు.

రేసులో మేము సైతం

తాండూరు: కమలం తాండూరు అసెంబ్లీ అభ్యర్థుల రేసులో మేము సైతం అంటూ గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి నాయకుల వరకు పోటీ పడ్డారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాలకు గాను అధిష్టానం దరఖాస్తులు స్వీకరించగా తాండూరు నుంచే అధికంగా అప్లికేషన్లు వచ్చాయి. కొడంగల్ అసెంబ్లీ స్థానానికి 20, పరిగి స్థానానికి 10, వికారాబాద్ నుంచి 5, తాండూరు నుంచి 13 మంది బీజేపీ నాయకులు తమ పేర్లను పరిశీలించాలని దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు మరి కొందరు దరఖాస్తు చేసినట్లు సమాచారం. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నుంచి పటేల్ రవిశంకర్, వికారాబాద్ నుంచి సాయికృష్ణ, పరిగి నుంచి ప్రహాల్లాద్ రావు, కొడంగల్ నుంచి నాగురావులు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీరు ఆసక్తి చూపించకపోవడం గమనార్హం. తాండూరు అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న వారిలో నరేష్ మహరాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యూ రమేష్ కుమార్ ఉన్నారు.

అభివృద్ధి పథంలో తాండూరు

- మంత్రి మహేందర్‌రెడ్డి
- తాండూరులో పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డితో కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని తాండూరులో పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యాలయం పరిధిలోకి 10 మండలాలు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి మహేందర్‌రెడ్డి సహకారంతో తాండూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని అన్నారు. ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తెస్తామని పేర్కొన్నారు. అనంతరం పంచాయతీరాజ్ ఈఈగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, ఎంపీపీలు అనితగౌడ్, బాలేశ్వర్‌గుప్తా, జెడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన ఈఈ శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

ధీర వనిత చాకలి ఐలమ్మ



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శుభప్రద్‌పటేల్, లింగ్యానాయక్ తదితరులు

- ఆమె పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదాం
- బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్
- కలెక్టరేట్‌లో ఘనంగా వర్ధంతి

వికారాబాద్ అర్బన్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర నారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెత్తందారి వ్యవస్థకు, దొరల పాలనకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ పోరాటం చేశారని గుర్తు చేశారు. హక్కుల కోసం ఎలుగెత్తి చాటారని కొనియాడారు. దొరల ఆధీనంలో ఉన్న భూములను పేదలకు పంచి సమసమాజ స్థాపనకు కృషి చేసిన ధీర వనిత ఐలమ్మ అని అన్నారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, ఎంపీడీవో సత్తయ్య, చాకలి సంఘం అధ్యక్షులు మారుతి, దత్తు, రాములు, జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, రాష్ట్ర ఉత్సవ కమిటీ వైస్ ప్రెసిడెంట్ సంగీతం రాజలింగం, జిల్లా ఎస్సీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సరదా కోసం వచ్చి..

- విగతజీవులుగా మారి..
- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



సోనీ (ఫైల్)



ప్రదీప్‌కుమార్ (ఫైల్)

చేవెళ్ల: వారంతా బీటెక్ విద్యార్థులు.. వీకెండ్ కావడంతో సరదాగా గడుపుదామని వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్ చూసేందుకు వచ్చారు.. తిరుగు పయనంలో రోడ్డు ప్రమాదం ఇద్దరిని బలితీసుకోగా.. మరో ఇద్దరిని ఆస్పత్రిపాలు చేసింది. ఈ విషాదకర సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలూరు బస్‌స్టేజీ సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కొంపల్లి ప్రాంతంలోని సెయింట్‌మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాలలో చప్పిడి సోని (19), మండవ ప్రదీప్‌కుమార్ (19), అఖిల్, ఆర్యవర్ధన్ బీటెక్ సెకండియర్ పూర్తి చేసుకొని మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు. నలుగురు కలిసి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌ను సరదాగా చూసేందుకు కారులో వచ్చారు. రాత్రి అక్కడే బస చేసిన వారు ఆదివారం ఉదయం తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో చేవెళ్ల మండలం ఆలూరు బస్‌స్టేజీ సమీపంలోకి రాగానే అతివేగంగా వస్తున్న వీరి కారు ఒక్కసారిగా అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. కారు వెనుకసీట్లో కూర్చొని ఉన్న సోని, ప్రదీప్‌కుమార్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ముందు సీట్లో ఉన్న అఖిల్, ఆర్యవర్ధన్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు గమనించి అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారులో ఇర్కుపోయిన మృతదేహాలను బయటకు తీసి అంబులెన్స్‌లో చేవెళ్ల ఆస్పత్రికి తరలించారు. అఖిల్, ఆర్యవర్ధన్‌కు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యంకోసం నగరంలోని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. సరదాగా వెళ్లిన పిల్లలు విగతజీవులుగా మారడం చూసి వారు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పిల్లల చదువు కోసం..

పిల్లల చదువు కోసమని తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్‌లోని ఆయా జిల్లాల నుంచి వచ్చి నగరంలో స్థిరపడ్డారు. చప్పిడి సోని తండ్రి మధుసూదన్‌రెడ్డిది కడప జిల్లా. అక్కడ మంచి ఉద్యోగం చేసే ఆయన పిల్లల చదువుకోసమని హైదరాబాద్‌లోని ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో చేరి కర్మాన్‌ఘాట్‌లో నివాసం ఉంటున్నాడు. అన్నింట్లోనూ తమ కూతురు ముందుండేదని ఇలా జరుగుతుందనుకోలేదని బోరున విలపించారు. మండవ ప్రదీప్‌కుమార్ తండ్రి వెంకటశేషయ్యది ప్రకాశం జిల్లా ఒంగోలు. ఒక్కడే కొడుకు కావడంతో అతని చదువుకోసం హైదరాబాద్‌కు వచ్చి కేపీహెచ్‌బీ కాలనీ ధర్మారెడ్డి కాలనీలో ఉంటున్నారు. ఒక్కగానొక్క కుమారుడు బాగా చదివి కుటుంబానికి ఆసరా అవుతాడనుకుంటే అనంతలోకాలకు వెళ్లిపోవటంతో కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. గాయపడిన అఖిల్‌ది అమీన్‌పూర్. సంగారెడ్డి జిల్లా పీవీఆర్ కాలనీలో ఉంటున్నాడు. తండ్రి కారు తీసుకొని స్నేహితులతో కలిసి అనంతగిరికి వెళ్లారు.

అరాచక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హుడాకాంప్లెక్స్: దేశంలో కులాన్ని, మతాన్ని అడ్డు పెట్టుకుని విద్వేషపూరిత ప్రసంగాలతో రెచ్చగొడుతూ రాజకీయంగా లబ్ధి పొందాలని కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వాటితో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర తొలి మహాసభ ఆదివారం సరూర్‌నగర్ మండల కార్యాలయంలో జరిగింది. ఇస్కఫ్ నేతలు, కార్యకర్తలు కొత్తపేట చౌరస్తా నుంచి సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. కుల, మత మౌఢ్యం లేని సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా ఇస్కఫ్ కృషి చేస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఇస్కఫ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో కొన్ని అరాచరక శక్తులతో ప్రజల్లో అభద్రతా వాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో అమాయక మహిళలు, యువతులపై లైంగిక దాడులు చేస్తూ, చిత్రహింసలకు పాల్పడుతూ హత్య చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని దుయ్యబట్టారు. ఇలాంటి సమయంలో ప్రజల మధ్య సామరస్య సంబంధాల పెంపునకు, సమైక్యశక్తిని చాటేందుకు, సాంస్కృతిక విధ్వంసాన్ని అడ్డుకునేందుకు ఇస్కాఫ్ నిరంతరం పాటుపడుతోందని కొనియాడారు. సమావేశంలో పార్టీ జాతీయ కార్యదర్శి సభ్యుడు, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, ఇస్కఫ్ జాతీయ కార్యదర్శి విజయ పదిహార, రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రావు, ప్రధాన కార్యదర్శి టి.విజయకుమారి, కార్యదర్శి అరుణ్‌కుమార్, ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి నజీంఖాన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, సరూర్‌నగర్ కార్యదర్శి చందునాయక్, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఫైమిదా, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

పేదల ఇళ్లకు రూ.100 కోట్లు

- జేఎన్ఎన్‌యూఆర్‌ఎం, వాంబే ఇళ్ల నివాసితులకు ప్రయోజనం
- మున్సిపల్ మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో గతంలో ప్రభుత్వం పేదలకు జేఎన్ఎన్‌యూఆర్‌ఎం, వాంబే పథకాల ద్వారా అందజేసిన ఇళ్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. చాలా ఏళ్లక్రితం నిర్మించిన ఆ ఇళ్లలో ఉంటున్న వారికి వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో తగిన భద్రత, రక్షణ లేకుండా పోయింది. వాటిల్లోని నివాసితులకు అవసరమైన మరమ్మతులు చేసుకొని, పునరుద్ధరించుకునేందుకు తగిన ఆర్థికస్థోమత లేదు. ఈ విషయాల్ని ఇటీవల మున్సిపల్ మంత్రి కేటీఆర్‌తో జరిగిన సమావేశంలో నగర ఎమ్మెల్యేలు ఆయన దృష్టికి తెచ్చారు. పేదల కోసం రూ.9100 కోట్లతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఉచితంగా అందజేస్తున్న ప్రభుత్వం పాతఇళ్లలో నివసిస్తున్న ఆ కుటుంబాలకు సైతం తగిన జీవన పరిస్థితులు కల్పించాల్సిన ఆవశ్యకతను కేటీఆర్ గుర్తించారు. కొన్ని నిధులు కేటాయిస్తే వేల సంఖ్యలో పేదలకు లబ్ధి చేకూరుతుందంటే ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడదని ఎమ్మెల్యేలకు చెప్పారు. వెంటనే సీఎంకు పరిస్థితిని వివరించారు. దాంతో రూ.100 కోట్లను ఆ ఇళ్లకు అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణలకు గ్రాంట్‌గా కేటాయించారు. హెచ్‌ఎండీఏ నుంచి ఆ నిధులను అందజేస్తారు. పునరుద్ధరణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు చేస్తారని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. నగరంలో జంగమ్మెట్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో జేఎన్ఎన్‌యూఆర్‌ఎం, వాంబే కాలనీలు ఉన్నాయి. ఆ కాలనీల్లోని ఇళ్లకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేయనున్నారు. జేఎన్ఎన్‌యూఆర్‌ఎం, వాంబే, రాజీవ్ ఆవాస్ యోజన పథకాల ద్వారా నగరంలో నిర్మించిన ఇళ్లు 52,159 కాగా, వాటిల్లో కొన్నింటిని పంపిణీ చేయలేదు. వాటిపైనా ప్రభుత్వం దృష్టి సారించే అవకాశం ఉంది.

కోర్కెలు తీర్చే రామలింగేశ్వరుడు



రామలింగేశ్వరుడు

- నేటి నుంచి ఏకాంబరి జాతర
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- రెండు రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- భారీగా పోలీసు బందోబస్తు

బషీరాబాద్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన నీళ్లపల్లి ఏకాంబరి రామలింగేశ్వర స్వామి జాతరకు ఆదివారం అంకురార్పణ చేశారు. శ్రావణ మాసం చివరి సోమవారం(నేడు) జరిగే ఈ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు గ్రామం నుంచి స్వామివారిని పల్లకిలో అధిష్ఠింపజేసి బాజాభజంత్రీలతో ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. 12వ తేదీ రాత్రి 12గంటలకు లంకా దహనంతో జాతర ముగియనుంది. భక్తు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆలయ పరిసరాల్లో మాంసం విక్రయాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జాతరకు తాండూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. నారాయణపేట్, సేడం, పరిగి డిపోల నుంచి కూడా బస్సులు ఉంటాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ పరిసరాలు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.



విద్యుత్ కాంతుల వెలుగులో ఆలయం

క్లుప్తంగా

న్యూజెర్సీలో 'బండి'ని సన్మానించిన పటేల్



బండి సంజయ్‌తో పటేల్ రవిశంకర్ దంపతులు

తాండూరు టౌన్: అమెరికాలోని న్యూజెర్సీలో ఎన్‌ఆర్‌ఐలతో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ను ఆ పార్టీ నాయకులు పటేల్ రవిశంకర్, ఆయన సతీమణి జయశ్రీ పటేల్‌లు ఆదివారం బండిని ఘనంగా సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో ఎన్‌ఆర్‌ఐలందరూ పార్టీకి మద్దతుగా నిలవాలని, ఆ సమయంలో భారత్‌కు రావాలని బండి సంజయ్ కోరినట్లు సమాచారం. అయితే గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన రవిశంకర్, ఆయన సతీమణి కూడా ఈసారి తాండూరు శాసనసభ ఎమ్మెల్యే టికెట్ కోసం అర్జీ పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా.. అమెరికాలో వారిద్దరూ బండి సంజయ్‌ను కలిసి సన్మానించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ భూములను దోచేస్తున్నారు: సీపీఎం



భూములను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: అధికారులు ప్రభుత్వ భూములను రాజకీయ నాయకులకు అప్పనంగా దోచిపెడ్తున్నారంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటయ్య ఆరోపించారు. మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలోని సర్వేనంబర్ 94, 95, 96లోని దాదాపు ప్రభుత్వ భూమిని ఆదివారం సీపీఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన భూమి సీలింగ్ భూమి అని తమ దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. అధికార పార్టీ నాయకులతో, రియల్టర్లతో కుమ్మక్కై అక్రమంగా 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈ వ్యవహారం వెనుక ఎవరెవరు ఉన్నారో తేల్చడంతోపాటు వారికి శిక్షపడే వరకు పోరాడుతామన్నారు. నిరుపేదలకు సీపీఎం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్తయ్య, రఘురాం, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాలు ఏకంకావాలి

బీసీ పొలిటికల్ జేఏసీ విద్యార్థి విభాగం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

కొడంగల్ రూరల్: రాష్ట్రంలో అత్యధిక జనసంఖ్య ఉన్న ముదిరాజ్‌లను రాజకీయంగా ఎదగనివ్వడంలేదని బీసీ పొలిటికల్ జేఏసీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పులిందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం పలు కులాల సంఘాల నాయకులతో కొడంగల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సబ్బండ వర్గాలు ఏకంకాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకమై నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీసీలు ఐక్యత చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు కృష్ణంరాజు, బాలరాజు, వెంకటయ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, సూర్యానాయక్, కేశవులు, న్యాయవాది వెంకట య్య, భీమరాజు, నర్మదా కిష్టప్ప, సతీష్‌ముదిరాజ్, నర్సింహులు, మహిపాల్, పాండు, రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

విడిగా వెళ్లి.. జంటగా ప్రత్యక్షం

- కొడంగల్ సర్కిల్ పరిధిలో పెరిగిపోతున్న ప్రేమవివాహాలు
- అదృశ్యం కేసుల్లో మెజార్టీవి అవే
- కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్న పోలీసులు



దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్

దౌల్తాబాద్: యువతీయువకులు ఒంటరిగా అదృశ్యమై ప్రేమించిన వ్యక్తిని పెళ్లాడి తిరిగి కొద్ది రోజులకే జంటగా పోలీస్‌స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. ఒకవైపు ఇరువురి బంధువులు వారి కోసం వెతుకుతుంటే.. మరోవైపు ప్రేమ వివాహాలు చేసుకున్న వారంతా ఇళ్లకు వెళ్లకుండా కుటుంబ సభ్యుల నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ నేరుగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు మేము ప్రేమ వివాహం చేసుకున్నామని పోలీసులు, కుటుంబ సభ్యులకు వాట్సాప్ ద్వారా పెళ్లి చేసుకున్న ఫొటోలు పంపుతున్నారు.

కొడంగల్ సర్కిల్ పరిధిలో..

- కొడంగల్ సర్కిల్‌లోని దౌల్తాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తం సుమారు 30 అదృశ్యం కేసులు నమోదవ్వగా అందులో దాదాపు 25 వరకు కేసులను పోలీసులు పరిష్కరించారు.
- నిత్యం వివిధ కేసుల్లో బిజీగా ఉండే పోలీసులకు మిస్సింగ్ కేసులు తలనొప్పిగా మారాయి.
- అదృశ్యమైన యువతీయువకులు వివాహం అనంతరం తమకు రక్షణ కావాలని వస్తుండగా కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు.
- మైనర్ల అదృశ్యం కేసుల విషయానికొస్తే బాలికను తీసుకెళ్లిన వారిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి బాలిక అదృశ్యానికి కారణమైన వారిని రిమాండ్‌కు తరలిస్తున్నారు.
- స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరిగింది.
- సెల్‌ఫోన్లలో వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా పరిచయాలు ఏర్పడి అదృశ్యాలకు దారితీస్తోంది.

ఫిర్యాదు అందిన వెంటనే...

- కొడంగల్ సర్కిల్ పరిధిలో వచ్చే మిస్సింగ్ కేసులకు సంబంధించి ఫిర్యాదు అందిన వెంటనే కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు.
- కొందరు కుటుంబసభ్యులు తమ అమ్మాయిని వివాహం చేసుకున్న అబ్బాయి బాగా చూసుకుంటాడని అబ్బాయితో పోలీస్ స్టేషన్‌లో పత్రం రాయించాలని పోలీసులను కోరుతున్నారు.
- సాధ్యమైనంత వరకు అమ్మాయి తల్లిదండ్రులు కుదిర్చిన వివాహాలు చేసుకోవాలని తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఇబ్బందుల్లో పడతారని పోలీసులు హెచ్చరిస్తున్నారు.
- అలాగే మేజర్లైన ప్రేమజంటల వినతులను స్వీకరించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు.

పిల్లలను గమనిస్తుండాలి



దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత రెండేళ్ల నుంచి నమోదైన మెజార్టీ అదృశ్య కేసులను పరిష్కరించాం. అదృశ్యమైన యువతీయువకులను వారి స్నేహితుల ఆధారంగా గుర్తిస్తున్నాం. మెజార్టీ అదృశ్యం కేసుల్లో ప్రేమవివాహాలు చేసుకుంటున్నవారే ఉన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలి. సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలి.

– రమేష్‌కుమార్, ఎస్‌ఐ, దౌల్తాబాద్

త్వరలో పాలమూరు–రంగారెడ్డి పూర్తి

- ప్రతి ఎకరాకు సాగునీరు
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- గోశాల నిర్మాణానికి భూమిపూజ

కొడంగల్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తి చేస్తామని, ప్రతి ఎకరాకు సాగునీరు అందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధి బూల్కాపూర్‌లో గోశాల నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగిరం చేశామని చెప్పారు. ఈ నెల 16న పాలమూరు రంగారెడ్డి ప్రారంభోత్సవ సంబురాలు నిర్వహించడానికి సిద్ధం కావాలని మంత్రి కేటీఆర్ ఆదేశించినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో 1.49 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని, కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేయడంతోనే పనుల్లో జాప్యం జరిగిందని వివరించారు. ప్రతీ పినికి ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయన్నారు.

అర్హులందరికీ 'గృహలక్ష్మి'

రైతులకు రూ.లక్ష వరకు రుణమాఫీ చేశామని, అర్హులైన ప్రతి ఒక్కరినీ గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత కరెంటు, రైతుబీమా, రైతుబంధు, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడినట్లు తెలిపారు. కుల వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, కష్టపడి పనిచేయాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావ్, ఏఎంసీ డైరెక్టర్ అరుణ్‌కుమార్, న్యాయవాది రాంనాయక్, మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, హిందూవాహినీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గోశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



శాకాంబరి అలంకరణలో..

శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమం నిర్వహించారు. గణపతి, కుమారస్వామి, నందీశ్వర, వీరభద్రేశ్వర స్వామి, పార్వతీదేవి విగ్రహాలకు అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. కపిలేశ్వర స్వామికి రుద్రాభిషేకం, అలంకరణ అనంతరం మారేడు బిల్వాలతో లక్ష బిల్వార్చన చేపట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీరభద్రేశ్వర స్వామికి పల్లకీ సేవ చేపట్టారు. పార్వతీదేవి అమ్మవారు శాకాంబరీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. – ధారూర్

రాష్ట్రంలో అరాచక పాలన



ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ మండిపడ్డారు. వికారాబాద్ పట్టణంలో ఆదివారం పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రసాద్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వికారాబాద్ నుంచి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, తొర్మామిడి సీనియర్ నాయకులు వెంకటయ్య, జిన్నారం మాజీ సర్పంచ్ లింగయ్య, సిద్దులూర్ సర్పంచ్ అంజయ్య.. వారి అనుచరులు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 17న తుక్కుగూడలో 10లక్షల మందితో భారీ బహిరంగ సభ చేపడుతున్నామన్నారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనాయకులు.. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేతో పాటు కేంద్ర ముఖ్య నాయకులందరూ పాల్గొంటారన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మైపాల్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కౌన్సిలర్ మురళి, రైతు విభాగం అధ్యక్షుడు రత్నారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, బ్లాక్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, కోఆప్షన్ సభ్యుడు జాఫర్, నాయకులు.. రాములు, పెండ్యాల అనంతయ్య, రాములు, లక్ష్మణ్, రాజశేఖర్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల అభివృద్ధికి కృషి

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



విరాళం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: బహుజనుల అభివృద్ధికి కృషి చేస్తామని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో గౌడసంఘం నేతలకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటు నిమిత్తం ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఎర్పాటు చేసేందుకు గౌడసంఘం నాయకులు ముందుకురావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడసంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి మహేశ్వరం రాములు, సంఘ నాయకులు కొండయ్య, వెంకటయ్య, బాల్‌రాజ్, రవి, భానుప్రకాష్, నరేష్, పెంటయ్య, నరేష్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు సముచిత స్థానం



ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ గ్రామం నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు.. బీఆర్‌ఎస్ మండల జనరల్ సెక్రెటరీ రాకేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ప్రజలు మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన నాయకులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు.. ఉమాశంకర్, రాంలింగారెడ్డి, రాములు, ప్రదీప్‌రెడ్డి, సతీష్ తదితరులు ఉన్నారు.

నేడు కల్యాణోత్సవం

అనంతగిరి: బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఆత్మలింగం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం అనంతరం 11గంటలకు కల్యాణోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఔటర్‌పై రోడ్డు ప్రమాదం

ఒకరి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఆదిబట్ల ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. కర్నూల్‌లో నివాసం ఉండే తమిళనాడుకు చెందిన సుబ్రమణ్యం, రంగనాథం, రాధాకృష్ణ, , తిమ్ములు, మాణిక్యం, రవి , రమేష్‌బాబు అనే వ్యక్తులు కర్నూల్ నుంచి ఏఎస్‌రావు నగర్‌కు కారులో రిసెప్షన్‌కు బయలుదేరారు. శంషాబాద్ వరకు వచ్చి ఔటర్‌రింగ్‌రోడ్డు ఎక్కారు. రావిర్యాల వద్దకు రాగానే ఎగ్జిట్ 13 వద్ద కారు పంక్చర్ అయ్యింది. టైర్ మార్చడం కోసం రాయి వెతుకుతున్నారు. వీరిలో సుబ్రమణ్యం రాయి కోసం రోడ్డు దాటుతున్నాడు. శంషాబాద్ నుంచి బొంగులూర్ వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సుబ్రమణ్యంను నగరంలోని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి సుబ్రమణ్యం మరణించినట్లు తెలిపారు. సుబ్రమణ్యం మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కిందపడి.. ఆత్మహత్య

అనంతగిరి: రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం వికారాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ అనిల్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం చించోలికి చెందిన సూర్యవంశి సంతోష్(42) జీవనోపాధి కోసం కుటుంబంతో కలిసి తాండూర్‌లో ఉంటున్నాడు. ఆదివారం ఉదయం వికారాబాద్‌కు వచ్చిన సంతోష్ సాయంత్రం తిరిగి తాండూర్‌కు వెళ్లేందుకు హుబ్లీ ఎక్స్‌ప్రెస్ టికెట్ తీసుకుని రెండవ నంబర్ ప్లాట్‌ఫారంపై వేచిఉన్నాడు. అయితే రైలు ప్లాట్‌ఫారంపై చేరుకోగానే ఒక్కసారిగా రైలు చక్రాల కిందికి దూకాడు. దీంతో శరీరం రెండు భాగాలుగా విడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహం వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా చించోలిలో ఉన్న అతడి తమ్ముడు కిరణ్ ఫోన్ నంబర్ లభించింది. వారికి వివరాలు తెలిపి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. స్టేషన్ మాస్టర్ సంజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- విద్యాశాఖ అభివృద్ధిలో వారి పాత్ర కీలకం
- ఎస్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్



ఉద్యోగుల శిబిరం వద్ద మాట్లాడుతున్న వేణుగోపాల్

వికారాబాద్ అర్బన్: సమగ్రశిక్ష అభియాన్ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులను రెగులరైజ్ చేయాలని ఎస్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు చేస్తున్న ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. 12 సంవత్సరాలుగా విద్యాశాఖలో చాలీచాలని వేతనాలతో రాష్ట్ర స్థాయి నుంచి మడల స్థాయి వరకు వివిధ హోదాల్లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. విద్యాశాఖ అభివృద్ధిలో వారి ఎంతో కీలకమన్నారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు బీఆర్‌ఎస్‌లో మళ్లీ ముసలం

- పంచాయతీరాజ్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంతో రాజుకున్న అగ్గి
- ప్రొటోకాల్ పాటించలేదంటూ అలకబూనిన పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్
- మంత్రి, ఎమ్మెల్యేపై అసంతృప్తి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్

తాండూరు రూరల్: తాండూరు నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో అంతా సర్దుకుంటుందనే క్రమంలో మంత్రి ప్రధాన అనుచరుడు, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్ ఎపిసోడ్ ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. తాండూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నూతన పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయాన్ని ఆదివారం మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రారంభించారు. అయితే ప్రారంభోత్సవానికి సంబంధించి ప్రొటోకాల్ పాటించలేదని రవిగౌడ్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ.. తాండూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అతిథిగృహాన్ని నూతన పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయానికి వినియోగించారని చెప్పారు. మన కార్యాలయంను వినియోగించుకోని ప్రారంభోత్సవంలో కనీసం.. స్థానిక ఎంపీపీ అనితాగౌడ్, జెడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపారెడ్డి పేర్లు ఎందుకు పెట్టలేదని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా మంత్రి, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి ప్రారంభం చేసి వెళ్లిపోయారు తప్ప కనీసం ప్రొటోకల్‌పై మాట్లాడలేదని రవిగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈఈ కార్యాలయానికి కేటాయించిన భవనాన్ని వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. మా పేర్లు పెట్టనప్పుడు... మా భవనం ఎందుకు అని ప్రశ్నించారు.

తప్పక పేర్లు పెడతాం

కేవలం పాత భవనంలో కార్యాలయాన్ని ప్రారంభించాం. నూతన భవనం అయితే తప్పకుండా అందరి పేర్లు పెట్టేవాళ్లం. ఇప్పటి నుంచి తప్పక ప్రొటోకాల్ పాటిస్తామని తెలిపారు.

– శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ సమీపంలోని ముర్తుజపల్లి గేటు వద్ద హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రాయణపల్లి తండాకు చెందిన జటావత్ బాసు(45) అనే వ్యక్తి మృతి చెందాడు. జటావత్ బాసు రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే, మరో ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి బైక్‌పై వస్తున్న అనిల్‌కుమార్ స్థానిక సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు వద్ద కార్మికునిగా పనిచేస్తున్న అప్పల నాయుడును ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇద్దరిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆమనగల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె ఆనంద్‌కుమార్



ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న ఆనంద్‌కుమార్

కేశంపేట: ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇస్తే షాద్‌నగర్‌లో గెలుస్తానని బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లె ఆనంద్ కుమార్ అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కోసం ఆదివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఇప్పటి వరకు పార్టీ సూచించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల మోర్చా అధ్యక్షుడు యుగంధర్ కూడా ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు



మాట్లాడుతున్న సీఐ రామాంజనేయులు

యాచారం: వినాయక చవితి వేడుకను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని గ్రీన్ ఫార్మాసిటీ సీఐ రామాంజనేయులు పేర్కొన్నారు. నక్కర్తమేడిపల్లి గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం వివిధ రాజకీయ పక్షాలు, మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వినాయక నవరాత్రులు పండుగను ప్రశాంతంగా జరుపుకొని నిమజ్జనం పూర్తి చూసుకోవాలని తెలిపారు. తాడిపర్తి బంధం చెరువు, కుర్మిద్ద పెద్ద చెరువు, మీరాఖాన్‌పేట చెరువు, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల్లో ఉన్న చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లు చేయడానికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.